క్లుప్తంగా

ఈ- క్రాప్‌తో రైతులకు మేలు

కొత్తపల్లి: ఈ- క్రాప్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి జోగిరాజు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ-క్రాప్ నమోదును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు అకౌంట్ పాసు పుస్తకం జెరాక్స్‌తో పాటు ఫోన్ నంబర్‌ను రైతు సేవ కేంద్రాల్లో ఉన్న సంచాలకులకు అందజేయాలి. ఈ- క్రాప్ బుకింగ్ చేయడం వల్ల రైతులకు పంట బీమా, రుణాలు, సబ్సిడీ, పంట నష్టం పథకాలు వర్తిస్తాయన్నారు.

మంగళ గౌరీదేవికి కుంకుమ పూజ



వాయనాలు స్వీకరిస్తున్న ముత్తయిదువలు

పిఠాపురం: స్థానిక చింతావారి వీధిలోని మహాలక్ష్మీ గణపతి సహిత సీతారామాంజనేయ ఆలయంలో వేంచేసియున్న శ్రీమహాలక్ష్మి సన్నిధిలో బుధవారం మంగళ గౌరీదేవికి కుంకుమ పూజ నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగి రవీంద్రనాథ్ ఠాగూర్ సత్యాదేవి దంపతుల చేతుల మీదుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, శ్రీలక్ష్మీ గణపతి స్వామికి గరిక పూజ నిర్వహించారు. సుమారు 200మంది ముత్తయిదువలకు పసుపు, కుంకుమ, గాజులు, పండ్లుతో కూడిన వాయినం అందజేశారు. పురోహితుల పర్యవేక్షణలో అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొత్తపల్లి పద్మ బుజ్జి, చింతా వేంకటేశ్వరరావు, దూళ్ళిపూడి భీమేశ్వరరావు, నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో వైద్య శిబిరాలు



మూలపేటలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం

కొత్తపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య తెలిపారు. సీజనల్ వ్యాధులపై మండలంలోని మూలపేట బుధవారం నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల పర్యవేక్షణలో వైద్య శిబిరాలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీని వ్యాప్తిచేసే ఏడిస్ ఈజిప్టి దోమ పగటి పూటే కుడుతుంది. ఈ దోమ కుట్టినప్పటి నుంచి ఒళ్లు నొప్పి, కళ్లు లాగడం, వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడంతోపాటు పలు లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యాధికి చికిత్స చేయించుకునే కన్నా నివారణ పద్ధతులపై దృష్టి సారించాలన్నారు. ఈ సీజన్‌లో దోమల నియంత్రణకు దోమ తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించుకోవాలన్నా. ఫ్లూ జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి వారిని ఇళ్ల వద్దే విశ్రాంతి తీసుకునేలా చూడాలన్నారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెద్దాపురం: తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు ఆలయం తరపున అమ్మవారి రూపు, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ, ప్రసాదం ఇస్తామన్నారు. ఉదయం 9 గంటలకే పూజ ప్రారంభం అవుతుందన్నారు. పూజకు సంబంధించిన మిగిలిన సామగ్రిని భక్తులు తమ వెంట తీసుకు రావాలని, అనంతరం అన్నప్రసాదం పంపిణీ ఉంటుందని ఈఓ తెలిపారు.

22న మరిడమ్మ ఆలయంలో..

ఈ నెల 22న పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ పూజల్లో పాల్గొన్న మహిళలకు ఆలయం తరపున అమ్మవారి రూపు, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ, ప్రసాదం ఇస్తామన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ లోగా అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రత ఫారం పూర్తి చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వ్రతమాచరించే భక్తులకు 98498 98065, 90004 88945, 73822 56912 ఫోన్ నంబర్లకు చేయాలన్నారు.

రేషన్ బియ్యం వ్యాపారులకు జనసేన నేత మద్దతు

కొత్తపల్లి: పిఠాపురం నియోజకవర్గంలో రేషన్ బియ్యం మాఫియా పెరిగిపోయింది. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసే వ్యాపారులకు జనసేన నాయకులే మద్దతు పలుకుతున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని అమీనాబాద్‌లో ఉన్న రేషన్ షాప్ సమీపంలో బుధవారం రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న ఒక వ్యాపారిని స్థానిక జనసేన నాయకులు అడ్డుకున్నారు. ఏలేరు ప్రాజెక్టు వైస్ చైర్మన్ ఊట నాని బాబు మనుషులమంటూ ఆ రేషన్ బియ్యం వ్యాపారి సమాధానం చెప్పారు. నాని బాబుతో మాట్లాడమంటూ అడ్డుకున్న వారికి ఫోన్ ఇచ్చాడు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసేది జనసేనకు చెందిన నాయకుడేనని, ఇటువంటి విషయాలు చూసీచూడనట్లు వ్యవహరించాలని నాని బాబు చెప్పడంతో ఆ వ్యాపారిని వదిలేశారు. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన కీలక నాయకుడు, పైగా ఒక ముఖ్యమైన పదవిలో ఉన్న వ్యక్తి రేషన్ బియ్య వ్యాపారులకు కొమ్ముకాయడమేమిటంటూ స్థానికులు చర్చించుకున్నారు.

ఉద్యమ స్ఫూర్తి.. చాటింది కీర్తి

- స్వాతంత్య్ర ఉద్యమంలో పెద్దాపురం
- సత్యాగ్రహానికి మద్దతుగా రెపరెపలాడిన జాతీయ జెండా

పెద్దాపురం: స్వాతంత్య్రోద్యమంలో ఎందరో స్ఫూర్తి ప్రదాతలు ఉన్నారు.. స్వేచ్ఛా వాయువుల కోసం ఎనలేని కృషి చేశారు. ఆ సమయంలో బ్రిటీష్ వారిని ఎదురించి సత్యాగ్రహానికి మద్దతుగా పురపాలక సంఘాలపై జాతీయ జెండాను ఎగురవేయడంలో పెద్దాపురం మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలిచింది. సత్యాగ్రహానికి మద్దతు ఇవ్వొద్దని, ఎటువంటి కార్యక్రమాలు చేయరాదని అప్పటి పెద్దాపురం నాయకులు, యువకులకు పోలీసులు ఆజ్ఞలు జారీ చేశారు. అయినప్పటికీ పెద్దాపురం నాయకులు మాత్రం తగ్గకుండా ఇక్కడి పురపాలక సంఘ కార్యాలయంపై ప్రథమంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతేకాకుండా దేవతా ఉత్సవం వద్ద గాంధీగిరి ఫోటో పెట్టి ఊరేగించారు. అప్పటి ఆంధ్రపత్రికలో ప్రచురించిన వార్త నేటికీ పదిలంగానే ఉంది. పురపాలక కార్యాలయ భవనాల్లో తొలుత పెద్దాపురం మున్సిపాలిటీలో జాతీయ జెండా రెపరెపలాడింది. తదుపరి ముంబాయి సత్యాగ్రహాన్ని బలపరుస్తూ గుంటూరు, చీరాల, తెనాలి, నెల్లూరు, రామచంద్రపురం పురపాలక సంఘాల్లో జాతీయ జెండాలు ఆవిష్కరించి దేశభక్తిని చాటారు.

పోరాట యోధుడు పొక్కులూరి


చెన్నపూరి స్వాతంత్య్రోద్యమంలో జిల్లాలో పెద్దాపురం తాలుకాకు ఓ గుర్తింపు ఉంది. 1940 జూన్ 26న చెన్నపూరి చైనా బజారు రోడ్డులో సత్యాగ్రహం చేస్తూ యుద్ధ వ్యతిరేక నినాదాలు చేయడంతో అరెస్ట్ కాబడిన ఆ పోరాట యోధుడే పెద్దాపురం మండలం కాండ్రకోట పొక్కులూరి సత్యనారాయణ. 1940 జూన్ 27న సత్యాగ్రహ ఉద్యమంలో ఆంధ్రాకు చెందిన ఏడుగురిని అరెస్టు చేయగా, మొదటి వ్యక్తి కాండ్రకోటకు చెందిన పొక్కులూరి సత్యనారాయణ (పెద్దాపురం తాలుకా). ఆయనతో పాటు సోమేశ్వరానికి చెందిన నాగదేవర వెంకట్రావు (రామచంద్రపురం తాలూకా), వానపల్లికి చెందిన బండారు వెంకట్రాజు (రాజోలు తాలూకా), వన్నెచింతలపూడికి చెందిన నడింపల్లి సీతా రామరాజు (అమలాపురం తాలూకా), పాణింగపల్లికి చెందిన అయ్యల సోమయాజులు కామేశ్వరరావు (రామచంద్రపురం తాలూకా), బి.తాటిపర్తికి చెందిన నామా మార్కు (పిఠాపురం తాలూకా), గొల్లప్రోలుకు చెందిన ఈయుణ్ణి వీర రాఘవాచార్యులు (పిఠాపురం తాలూకా) అప్పట్లో కేసులో అరెస్ట్ అయ్యి స్వాతంత్రోద్యమంలో కీలకపాత్ర పోషించారు. యుద్ధానికి ప్రధాన సూత్రధారిగా పొక్కులూరి సత్యనారాయణ 1941 జూన్ 28 నుంచి అక్టోబర్ 15 వరకూ సుమారు నాలుగు నెలల 12 రోజుల పాటు బళ్లారి ఆరిపురంలో జైలు శిక్ష అనుభవించారు. 1943 నుంచి 1946 వరకూ తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాకినాడ కార్యాలయంలో పని చేశారు. 1967 జూలై 14న విలేజ్ గైడ్ వర్కర్‌గా పదవీ విరమణ పొందారు. అప్పట్లో 35 రూపాయల రిటైర్‌మెంట్ పింఛన్‌తో కుటుంబాన్ని పోషించేవారు. ఆయన చిన్నాన్నలు పిల్లల కుటుంబం నేటికీ కాండ్రకోట గ్రామంలో నివసిస్తుంది. 1912 ఆగస్టు 15న జన్మించిన ఆయన 2004 ఏప్రిల్ 6న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఏడుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. హైదరాబాద్‌లో వారు ఉంటున్నట్లు ఇక్కడున్న ఆయన మునిమనవడు పొక్కులూరు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. తమ తాత స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొనడం గర్వంగా ఉందని, కుటుంబ సభ్యులంతా ఆగస్టు 15వ తేదీన ఆయనకు నివాళులర్పిస్తామన్నారు.



ప్రథమంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన అప్పటి పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం (ఫైల్)



పొక్కులూరి సత్యనారాయణ (ఫైల్)



7 గురు ఆంధ్ర సత్యాగ్రహుల అరెస్టు

చెన్నపురిలో సత్యాగ్రహము

చెన్నపురి, జూన్ 27:—

అప్పటి పత్రికలో సత్యరాయణ అరెస్ట్‌పై వచ్చిన పేపర్ క్లిప్పింగ్

మత్తు పదార్థాల రహిత సమాజమే లక్ష్యం

పిఠాపురం: మత్తు పదార్థాల రహిత సమాజమే లక్ష్యంగా విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి విద్యార్థులకు సూచించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌పై ప్రతిజ్ఞ, అవగాహన సదస్సులు బుధవారం పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆర్ఆర్‌బీ హెచ్ఆర్‌లో నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతు నషా ముక్త్ భారత్ అభియాన్ అనేది భారత్ ప్రభుత్వం ప్రారంభించిన ఒక జాతీయ అవగాహన కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని మత్తు పదార్థాలరహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో స్కూల్, కళాశాలలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పొగాకు, మద్యం, గుట్కా, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు ఒక్క వ్యక్తినే కాకుండా, మొత్తం కుటుంబాన్ని సమాజాన్ని నాశనం చేస్తాయన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు.ఎవరైనా విద్యార్థులు మత్తు పదార్థాలు వాడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 112, 1933 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ శ్రీ, బీపీసీ సూర్యకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నాకుమారి, శాంతకుమారి, అమరావతి కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ దుర్గాదేవి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సామర్లకోట: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా బుధవారం రైల్వే ప్లాటుఫారంపై రైల్వే ఉద్యోగులు, ప్రయాణికులతో ప్రతిజ్ఞ చేయించారు. రైల్వేలో మత్తు పదార్థాలు రవాణా చేయడం నేరమని చెప్పారు. అదేవిధంగా మత్తు పదార్థాల రవాణా విషయం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై రైల్వే అధికారులు వెంటనే స్పందించాలని సూచించారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా సామర్లకోట స్టేషన్‌కు వచ్చిన బొకారో ఎక్స్‌ప్రెస్‌లోని ప్యాంట్రీ కార్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో హెల్త్ ఇన్‌స్పెక్టర్ బి.కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, టీటీఐ చైతన్య, జీఆర్పీ ఎస్సై వాసు, ఆర్పీఎఫ్ ఎస్సై ప్రవీణ్‌కుమార్, స్టేషన్ సూపరింటెండెంట్ జీకేఎస్ శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

అప్రమత్తత అవసరం

రైల్వే ప్రయాణికుల భద్రతపై ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి అన్నారు. రైల్వే స్టేషన్ విశ్రాంతి భవనంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఉద్యోగి తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదన్నారు. సిగ్నల్ డిపార్ట్‌మెంట్‌తో పాటు ట్రాక్ మెన్‌ల బాధ్యత ఎంతో ఉంటుందన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో చెరువులు గండి కొట్టి పట్టాలపైకి నీరు వచ్చే అవకాశం ఉంటుందని, అటువంటి విషయాలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అప్రమత్తం చేయాలన్నారు. స్టేషన్ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఉత్తీర్ణతకు కృషి చేద్దాం



సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులకు సూచనలు ఇస్తున్న డీఐఈఓ శారద

సామర్లకోట: ఇంటర్‌లో ఫలితాల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి ఐ.శారద అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో ఆమె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేయడంతో కళాశాల పరిస్థితులపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంది. దాంతో విద్యార్థుల సంఖ్య పెరగడానికి, ఉత్తీర్ణత శాతం ఫలితాలపై ఆధారపడి ఉంటుందన్నారు. ఒకేషనల్‌పై మరింత దృష్టి సారించాలన్నారు. ఈ మేరకు అధ్యాపకుల హాజరు శాతం, టీచింగ్ డైరీ, విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఇంటర్ బోర్డు పాటిస్తున్న నియమ నిబంధనలు, సంస్కరణలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఒకేషనల్‌లో అడ్మిషన్ల శాతం పెంచడానికి ప్రిన్సిపాల్ సీహెచ్ లీలాశ్రీదేవి చేస్తున్న కృషిని అభినందించారు. అధ్యాపకులు మంచి విద్యాబోధనతో కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆమె సూచించారు. అనంతరం ప్రిన్సిపల్ శ్రీదేవి ఆధ్వర్యంలో డీఐఈఓ శారదను సత్కరించారు.

క్రయ విక్రయదారులకు కష్టాలే..

కాకినాడ లీగల్: ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టడంలో రిజిస్ట్రేషన్ శాఖ అగ్రస్థానంలో ఉంటుంది. అయితే ఇక్కడ సేవలకు నిత్యం అంతరాయం కలుగుతుంది. కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ సరఫరా ఉన్నా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ ఇన్వర్టర్లు పనిచేయకపోవడంతో కంప్యూటర్లు ఆగిపోయాయి. ముందుగా ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి ఇన్వర్టర్లు పనిచేయక కంప్యూటర్లు ఓపెన్ కాకపోవడంతో సమయం అయిపోవడంతో స్లాట్ బుకింగ్ ముగిసిపోయింది. ఇందులో భాగంగా ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ముందుగా 12 మంది స్లాట్ బుకింగ్ చేసుకున్న దస్తావేజు రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో క్రయవిక్రయదారులు ఇబ్బందులకు గురయ్యారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇన్వర్టర్ పనిచేయకపోవడంతో సమయానికి స్లాట్ బుకింగ్ ఓపెన్ కాకపోవడం కారణంగా రిజిస్ట్రేషన్‌కు అదనంగా రూ.రెండు వందలు చెల్లించి మరో సమయానికి స్లాట్ బుకింగ్ చేసుకున్నారు. ప్రతి డాక్యుమెంట్‌కు రూ.500 చొప్పున యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారని, పనిచేయని ఇన్వర్టర్లు, కంప్యూటర్లతో కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగులతో పనిచేయిస్తుందని క్రయవిక్రయదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్వర్టర్లు పనిచేయకపోవడంపై కాకినాడ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జేయూఎస్ జయలక్ష్మి వివరణ కోరగా, దీనిపై అనేకసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.



కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కంప్యూటర్లు పనిచేయక ఇలా..

'పది' విద్యార్థులకు నగదు పురస్కారాలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ప్రభుత్వ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో జరిగిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు అందిస్తున్నట్లు ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.పద్మనాభం బుధవారం తెలిపారు. కాకినాడ పెన్షనర్ల భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పద్మనాభం మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధులు డాక్టర్ ఉప్పలూరి గోపాలకృష్ణ మనమరాలు, రిటైర్డ్ సూపరింటెండెంట్ శేషగిరి సౌజన్యంతో నగదు, సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. గొల్లప్రోలు జెడ్పీ పాఠశాల విద్యార్థి తోట పుష్పాంజలి, సంపర జెడ్పీ పాఠశాల విద్యార్థి పోలిశెట్టి వీరవెంకట శివలక్ష్మి తేజశ్రీలు 594 మార్కులు సాధించడంతో వీరికి చెరో రూ.నాలుగు వేలు, జెడ్పీ పాఠశాల గొల్లప్రోలు ఆకేటి కనకవల్లి 590 మార్కులు రావడంతో రూ.3 వేలు, కొత్తపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థి తొగర పావని షన్ముఖి, పండూరు జెడ్పీ పాఠశాల విద్యార్థి వై.రూపాదేవికి 588 మార్కులు పొందడంతో చెరో రూ. రెండు వేలు అందిస్తున్నట్లు శేషగిరి తెలిపారు. వీరికి ఈ నెల 15 సంఘ కార్యాలయ ఆవరణలో జరిగే వేడుకల్లో అందిస్తామన్నారు. 15న స్వాతంత్య్ర దినోత్సవానికి రిటైర్డ్ మేజర్ జనరల్ జ్యోతుల వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా వస్తారని పద్మనాభం తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు పద్మనాభం తదితరులు

వానొచ్చె.. నిండా ముంచేసె..

సామర్లకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో బుధవారం కురిసిన వర్షానికి పట్టణ, మండల పరిధిలోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్టేషన్ సెంటర్, బస్ కాంప్లెక్స్, జయలక్ష్మీ థియేటర్ రోడ్డు, సత్యనారాయణ పురం రోడ్డు, సంపెంగతోట, వెలమపేట, రథం సెంటర్, షిర్డీ సాయిబాబా రోడ్డు, వెలమపేట, సంగీతరావుపేట, సీతారామ కాలనీ, భాస్కర్‌నగర్, కాకినాడ రోడ్లు చెరువులుగా మారాయి. బస్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ ఎదురు ఎదురుగా ఉండటంతో స్టేషన్ సెంటర్‌లో రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అప్పయ్య చెరువు నుంచి డ్రైన్‌లో నీటి ప్రవాహంతో సత్యనారాయణపురం రోడ్డు చెరువుగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి డ్రైన్ల ద్వారా ప్రవహించే నీరు స్థానిక స్టేషన్ సెంటర్‌లోని ప్రధాన డ్రైన్‌లోకి చేరుతుంది. అయితే ఆ డ్రైన్ నిండిపోవడంతో జయలక్ష్మీ థియేటర్ రోడ్డు, స్టేషన్ సెంటర్లు చెరువులను తలపించాయి. రైల్వే స్టేషన్ సెంటర్‌లోని రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పూడిక తీయడానికి అవకాశం లేకుండా డ్రైన్లను ఆక్రమించడంతోనే రోడ్లపై నీరు నిలిచిపోతుందని వాదనలు ఉన్నాయి. వర్షపు నీరు డ్రైన్లలోకి వెళ్లే అవకాశం లేక రోడ్లు చెరువులుగా మారుతున్నాయి. అదేవిధంగా వీకే రాయపురం, ఉండూరు, చంద్రపాలెం గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రెండు రోజులుగా కురిసిన వర్షం మెట్ట ప్రాంతాలతో పాటు డెల్టా ప్రాంతాలలో వరి నాట్లకు మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. వేట్లపాలెం, బిక్కవోలు గ్రామాల వద్ద చానల్ గోదావరి కాలువకు చెందిన చానల్ గేట్లు ఎత్తివేయడంతో వీకే రాయపురంలోని పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయని ఆ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జలమయమైన పిఠాపురం మెయిన్ రోడ్డు

చెరువుల్లా రహదారులు

పిఠాపురం: ఒక పక్క ఏలేరు నీటితో పిఠాపురం పట్టణ వీధులు జలమయమయ్యాయి. మరో పక్క భారీ వర్షంతో రోడ్లు చెరువులుగా మారాయి. ముఖ్యంగా బుధవారం కురిసిన భారీ వర్షానికి పిఠాపురం ప్రధాన రహదారి జలమయమవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక వర్షం వస్తే చాలు వీధులు, రోడ్లు జలమయం కావడం సర్వసాధారణంగా మారింది. అధికారులు స్పందించి ముంపు నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న సామర్లకోట రైల్వే స్టేషన్, బస్ కాంప్లెక్స్ కూడలి



చెరువులా పిఠాపురంలో ఉప్పాడ సెంటర్ మెయిన్ రోడ్డు

యువతపైనే దేశ భవిష్యత్తు



నషాముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయిస్తున్న సాయిరామకృష్ణ

సామర్లకోట: దేశ భవిష్యత్తు యువశక్తిపై ఆధారపడి ఉందని, అటువంటి యువత మన దేశాన్ని మాదకద్రవ్య రహిత దేశంగా మార్చడానికి ప్రతిన బూనాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో పాఠశాల సిబ్బంది, విద్యార్థులచే నషాముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశలో మంచి అలవాట్లు కలిగి ధృడమైన యువ శక్తిగా తయారు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.గంగాభవానీ, బీఆర్ఎస్ శివకుమార్, ఎస్.హరినాథ్, టీఎస్ పద్మావతి, పీఈటీ పి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న క్రాంతికుమార్

పెద్దాపురం: మున్సిపల్ పారిశుధ్యం విభాగంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు పూర్తి రోజు వారాంతపు సెలవులు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్లు బుధవారం పెద్దాపురం కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సెలువులు ఇప్పించాలన్నారు. రోజూ మలినాలను శుభ్రం చేస్తున్న వారికి కనీస భద్రత లేకుండా పోయిందని, తక్షణం రక్షణ సౌకర్యాలు కల్పించాలని కోరారు. యూనియన్ నాయకులు వఱ్ఱే గిరిబాబు, మణికి కృష్ణ మాట్లాడుతూ వారంతపు, పండగ సెలవులు, క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ వారంతపు సెలవు ఇస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో యూనియన్ నాయకులు అందుగుల సురేష్, అప్పారావు, వఱ్ఱే రమణ, ముత్యాల సత్యనారాయణ, దొండపాటి శేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దాత సహకారంతో భోజనశాల, ఆర్వో ప్లాంటు



భోజన శాల, ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప తదితరులు

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేటలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో దాత సహకారంతో రూ. నాలుగు లక్షలతో భోజనశాల, ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో బాలికలు భోజనం చేయడానికి షెడ్ లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు గమనించారు. దీంతో బాబు బంధువులు వాటిని నిర్మిస్తామని హామీ ఇచ్చి పూర్తి చేశారు. దానిని సూరపురాజు జైభార్గవ పేరున అతని తల్లిదండ్రులు నిర్మించారు. భార్గవ జయంతిని పురస్కరించుకుని బుధవారం వాటిని హెచ్ఎం రాయుడు విజయలక్ష్మి అధ్యక్షతన ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. మండల విద్యాశాఖాధికారులు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, మానవ హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, కౌన్సిలర్ బలుసు వాసు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-గ్రామ్ స్వరాజ్‌పై పట్టు సాధించాలి



ఎంపీడీఓలకు శిక్షణ ఇస్తున్న డీపీఎం స్వామి

సామర్లకోట: ఈ-గ్రామ్ స్వరాజ్‌పై ఎంపీడీఓలు పట్టు సాధించాలని జిల్లా పంచాయతీరాజ్ మేనేజర్ జి.స్వామి అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో గత నెల 28 నుంచి ఉమ్మడి జిల్లాలైన శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు నెల రోజుల పాటు శిక్షణ జరుగుతుంది. ఇందులో భాగంగా గురువారం ఈ-గ్రామ్ స్వరాజ్‌పై డీపీఎం శిక్షణ ఇచ్చారు. పంచాయతీరాజ్ సంస్థల ప్రణాళిక, బడ్జెట్, అకౌంటింగ్, పర్యవేక్షణ, ఆస్తుల నిర్వహణ వంటి విధులను ఏకీకృతం చేయడం ద్వారా వికేంద్రీకృత ప్రణాళిక, ప్రగతి నివేదిక, పని ఆధారిత అకౌంటింగ్‌లో మెరుగైన పారదర్శకతను తీసుకు రావడం లక్ష్యంగా ఈ గ్రామ్ స్వరాజ్‌ను ప్రారంభించారన్నారు. అదే విధంగా మరో సీనియర్ ఫ్యాకల్టీ సమాచార హక్కు చట్టంపై వివరించారు.